
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.4 ; కనిష్టం 26.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 16 ఆగస్టు 2024



ఖత్‌గాం ప్రాథమిక పాఠశాలలో ఎగరని జాతీయజెండా



భైంసా రూరల్, ఆగస్టు 15 : మండలంలోని ఖత్‌గాం ప్రాథమిక పాఠశాలలో గురువారం జాతీయ జెండా ఎగురవేయలేదు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. అందులో ఒకరు లీవ్‌పై వెళ్లగా మరొక ఉపాధ్యాయురాలు ఎలాంటి అనుమతులు లేకుండా గైర్హాజరయ్యారు. దీంతో పాఠశాలలో జాతీయ జెండా ఎగరలేదు. ఈ సంఘటనపై ఎంఈవో సుభాష్ ను వివరణ కోరగా తనకు సంబంధం లేదని బదులిచ్చారు. గ్రామంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.



ప్రసంగిస్తున్న ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య

విద్యార్థుల ప్రదర్శన

రెపరెపలాడిన జాతీయజెండా

- రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పునరంకితం
- ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య సందేశం
- హాజరైన కలెక్టర్, ఎస్పీ, ప్రముఖులు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. ప్రభుత్వ శకటాల ప్రదర్శన, స్టాళ్లను సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు తెలియజేసేలా శకటాలు నిర్వహించిన ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అమితంగా అలరించాయి. ప్రభుత్వ ప్రోత్సాహక ప్రతిభా పురస్కారాలను పలు శాఖల అధికారులు, సిబ్బందికి అందజేశారు.

రాష్ట్ర పురోభివృద్ధికి అంకితం కావాలి : రాజయ్య

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధన కోసం ప్రతి ఒక్కరూ అంకితం కావాలని ముఖ్యఅతిథి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య ప్రభుత్వం తరపున పిలుపునిచ్చారు. ఎంతో మంది త్యాగధనుల ప్రాణాలు అర్పించడంతో దేశానికి స్వాతంత్ర్యం లభించిందని వారిని జోహార్లు తెలిపారు. వారి త్యాగాలు వృధా కానివ్వకుండా దేశ సమగ్రత కాపాడుతూ అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అనతికాలంలోనే ప్రజా సంక్షేమ పథకాల అమలులో దూకెళ్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుకు శ్రీకారం చుట్టి వారి అభిమానం నిలబెట్టుకుంటున్నారన్నారు. దేశంలో ఎన్నడే లేని విధంగా రైతులకు రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించారన్నారు. ఏకకాలంగా రెండు లక్షలు రుణమాఫీ వర్తింపజేయడంతో రైతులు పండగ చేసుకుటున్నారని తెలిపారు. 49,163 మంది రైతులకు 372 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి సౌలభ్యం కలిగించిందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సొంత ఇంటి కల నెరవేర్చే ప్రయత్నంలో ప్రభుత్వం నిమగ్నమైందన్నారు. ఏడాదిలోపే 4 లక్షల 50 వేల ఇళ్లు నిర్మించ తలపెట్టినట్లు చెప్పారు. దీంతో నియోజకవర్గానికి 3,500ల ఇళ్లు నిర్మిస్తారన్నారు. జిల్లాలోని వైద్య కళాశాలలో అన్ని రకాల సదుపాయాలతో 100 మంది విద్యార్థులకు బోధన జరుగుతోందన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు పరిమితిని ఐదు నుంచి పది లక్షలకు పెంచినట్లు తెలిపారు. జిల్లాలో 8 ప్రైవేట్, 6 ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు విలువైన వైద్యచికిత్సలు అందిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా 24 గంటల పాటు జరుగుతోందన్నారు. 200ల యూనిట్లలోపు గృహజ్యోతి పథకం ద్వారా ఉచితంగా సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలో లక్ష 14 వేల కుటుంబాలకు జీరో బిల్లులు అందజేసినట్లు వివరించారు. టీఎస్ ఐపాస్ ద్వారా 3 వేల విద్యుత్ కనెక్షన్లు అందజేశామన్నారు. నీటి పారుదల రంగంలో పెద్దమొత్తంలో నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తున్నామన్నారు. నిరమల్, జగిత్యాల జిల్లాలోని 18,016 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు మామడ మండలం పొన్కల్ గ్రామ సమీపంలో 677 కోట్ల వ్యయంతో సదర్మాట్ బ్యారేజీ నిర్మిస్తున్నామన్నారు. 4.24 కోట్లు ఖర్చు చేశామన్నారు. గ్రామీణాభివృద్ధి పథకంలో భాగంగా ఉపాధిహామీ ద్వారా 49.89 లక్షల పనిదినాల పనికల్పించి రాష్ట్రంలోని ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. స్వయం సహాయక సంఘాలకు 458 కోట్ల రుణాలు అందజేశామని, 7,500ల సంఘాలకు 8 కోట్ల వడ్డీలేని రుణాలు అందజేశామన్నారు. నిర్మల్ మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాల కోసం 23.45 లక్షలు మంజూరై ఆరు పనులు పురోభివృద్ధిలో ఉన్నాయన్నారు. బీటీ రోడ్లు, డంపింగ్‌యార్డ్‌లు, స్మశాన వాటికలు తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వన మహోత్సవంలో ఇప్పటి వరకు 15 లక్షల మొక్కలు నాటామని తెలిపారు. పది ఫలితాల్లో జిల్లా ప్రథమస్థానంలో నిలవడం హర్షణీయమన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేస్తున్నామని విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పంచాయతీ రాజ్ శాఖలో 396 గ్రామాల్లో డంపింగ్ యార్డ్‌లు, సెగ్రిగేషన్ షెడ్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. 43.56 లక్షల మొక్కలు నాటామని పేర్కొన్నారు. త్వరలో రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వెనుక బడిన అభివృద్ధి తరగతుల శాఖ 1850 మందికి 1 కోటీ 35 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నామ న్నారు. చట్టవిరుద్ధ కార్యక్రమాలపై నిరంతర తనిఖీలు చేప ట్టామని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు ఇప్పటి వరకు 5 యూనిట్లకు 53 కోట్ల 24 లక్షల పెట్టుబడితో ఉపాధి కల్పించామన్నారు. జిల్లా అభివృద్ధికి అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, ప్రజలు సమైక్యంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, తదితరులు ఉన్నారు.



జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేస్తున్న ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కలెక్టర్,ఎమ్మెల్యే

స్వాతంత్ర్య సమరయోధుల
త్యాగాలు స్మరించుకోవాలి : ఎస్పీ



వందనం చేస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 15 : స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జాతీయ పతాకావిష్కరణ చేశారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మాతృభూమి కోసం ఎంతో మంది ప్రాణాలు పణంగా పెట్టి బ్రిటిష్ వారితో పోరాటం చేశారన్నారు. వారిని స్మరించుకోవడమే అసలైన నివాళి అన్నారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజలకు పోలీసులు మెరుగైన సేవలందించాలన్నారు. భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, ఇన్స్‌పెక్టర్లు ప్రవీణ్ కుమార్, నవీన్ కుమార్, గోపినాథ్, రామకృష్ణ, ఆర్‌ఐలు రామ్ నిరంజన్, శేఖర్, రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పథకాలు పొందిన డీఎస్పీ గంగారెడ్డి, ఎస్సై ఎండీ గౌస్, ఏఎస్సైలు ఎల్. దేవ్, సుదర్శన్, ఏఆర్‌ఎస్సైలు సాహెబ్ రావు, గుణవంత్, విజయరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు శంకర్, రాజేశ్వర్, అంబరావు, ఉత్తంను ఎస్పీ అభినందించారు.

పతాకావిష్కరణ చేసిన కలెక్టర్...

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో...

బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా జాతీయ పతాకావిష్కరణ చేశారు. మారుగొండ రాము, గంద్రత్ రమేష్, నజీరుద్దీన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

సమరయోధుల త్యాగాలు మరువలేనివి

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 15 : స్వాతంత్ర్య యోధుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. 78వ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఆయన గురువారం గాంధీపార్క్, ట్యాంక్‌బండ్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాటి నాయకులు బ్రిటిష్ పాలకులను ఎదిరించి స్వాతంత్ర్యం సాధించినందునే నేడు మనమంతా స్వేచ్ఛావాయువులు పీల్చగలుగుతు న్నామన్నారు. అప్పుడు మువ్వన్నెల జెండాను చేతబట్టిన వారిని కారాగారాల్లో వేసి చిత్రహింసలకు గురిచేసేవారని అన్నారు. అదే జెండా ప్రజల్లో దేశభక్తి పెంచి అందరినీ ఐక్యం చేసి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య పతనానికి కారణమైందన్నారు. అంతటి మహోన్నతమైన జాతీయ జెండాను ప్రధాని మోదీ పిలుపు మేరకు దేశంలోని ప్రతి ఒక్కరూ తమ ఇళ్ళు, కార్యాలయాలపై మువ్వన్నెల జెండా ఎగురవేసి దేశభక్తి, ఐక్యత చాటడం హర్షణీయమన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నాయకులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి గురువారం నియోజకవర్గంలోని 63 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 14 లక్షల 50 వేల రూపాయల ఎల్‌వోసీలను అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.



జిల్లా బీజేపీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

జిల్లా కేంద్రంలోని స్థానిక భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అలివేలు మంగ, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీరామోజు నరేష్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ కే. శ్రావణ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే నిండా ముంచింది

- బాసర ఆలయంలో దోపిడి ఘటనకు కారణాలు ఇవే..
- సెక్యూరిటీ ఎదుట నుండే దొంగ ఆలయంలోకి ప్రవేశం
- బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలోనే ఘటన
- పరిపాలన, పర్యవేక్షణ లోప ఫలితం



మహాంకాళి ఆలయం వద్ద కౌంటర్



డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు



అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గ్రామస్థుల ఆందోళన



ఘటన సీసీ ఫుటేజి చూస్తున్న ఎమ్మెల్యే రాంరావు పటేల్, పక్కన ఆలయ ఈవో

బాసర, ఆగస్టు, 15 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో జరిగిన దోపిడి ఘటనతో అనేక లోపాలు వెలుగుచూస్తున్నాయి. భద్రతా లోపమే నిండా ముంచినట్లు అర్థమవుతుంది. రాత్రి 10 గంటల ప్రాంతంలోనే దుండగుడు దర్జాగా సెక్యూరిటీ సిబ్బంది ఎదుట నుండే ఆలయంలోకి ప్రవేశించిన దృశ్యాలు సీసీ కెమెరా రికార్డుల్లో చూసి అధికారులు నివ్వెర పోయారు. సుమారు రెండు గంటల పాటు దుండగుడు స్వేచ్ఛగా తిరుగుతూ తన పని కానిచ్చేశాడు. ఉదయం ఆలయం తెరవడానికి వచ్చిన సిబ్బంది చూసే వరకు ఘటన వెలుగులోకి రాలేదు. సీసీ కెమెరాల దృశ్యాలను చూస్తుంటే దుండగుడు నగదు కోసం మొదట ప్రసాదం టికెట్‌లు విక్రయించే కౌంటర్ తాళాలు ధ్వంసం చేశాడు. ఆ తర్వాత ఆలయంలోకి భక్తుల క్యూలైన్‌లపై నుంచి దూకుతూ లోనికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆలయ ప్రాంగణంలో వేసిన రేకుల షెడ్డు స్తంభాలను పట్టుకొని లోపలకి దిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహాంకాళి ఆలయం వద్ద, ఆలయ ప్రాంగణంలో ప్రైవేటు వ్యక్తులకు సంబంధించి చీరెల విక్రయ కేంద్రంలో దుండగుడు వెతికినట్లు ఆనవాళ్లున్నాయి. ప్రధాన ఆలయం పక్కనే ఉన్న దత్త మందిరంలోని హుండీని ధ్వంసం చేసి నగదు కానుకలన్నింటిని ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరా రికార్డు ప్రకారం 22 సంవత్సరాల వయస్సు గల యువకుడు దోపిడికి పాల్పడినట్లు అర్థమవుతుంది. కానుక లన్నింటిని సంచిలో వేసుకొని నిర్మానుష్యంగా ఉండే దక్షిణం వైపు నుంచి దుండగుడు వెళ్లిపోయినట్లు అధికారులు భావిస్తున్నారు. దాదాపు రెండు గంటల పాటు వచ్చిన అగంతుకుడు రెండు, మూడు చోట్ల ధ్వంసం చేసిన ఆ శబ్దాలు విని పసిగట్టలేని స్థితిలో ఆలయ భద్రత సిబ్బంది ఉన్నారు. విధుల్లో ఆరుగురు పోలీసు హోంగార్డులు ఉన్నప్పటికి ఈ ఘటనను ముందే పసిగట్టలేకపోయారు.

ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ ఘటనతో ప్రధాన ఆలయానికి పెనుముప్పు తప్పినట్లయింది. నిఘాను కళ్లుగప్పి ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించాడు. ప్రధాన ఆలయం పక్కనే ఉన్న ప్రధాన గర్భాలయానికి ఎలాంటి ముప్పు వాటిల్లక పోవడంతో అధికారులందరూ ఊపిరి పీల్చుకున్నారు. లోపలికి వెళ్లిన దుండగుడు ఏం చేసినా భద్రతా సిబ్బంది మాత్రం కనిపెట్టే స్థితిలో లేనట్లు దీన్ని బట్టి అర్థమవుతుంది. దుండగుడే దత్తాత్రి ఆలయంలో దొరికిన సొమ్మును తీసుకొని వెళ్లిపోయాడే తప్ప భద్రతా సిబ్బంది అలికిడితోనో.. ఇతర భద్రతా చర్యలను చూసి భయపడో వెళ్లిపోయినట్లు కనిపించడం లేదు. ఈ ఘటనలో అమ్మవారి ప్రధాన ఆలయంలో భద్రత అంతా డొల్లాగా తేటతెల్లమైంది.

సుమారు ఆరు నెలల క్రిందట ఆలయానికి అతి సమీపాన గల డార్మేటరీ హాలులో చోరీ జరిగింది. సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి భద్రపరిచిన కాపర్ కరెంటు తీగలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి అధికారులు పట్టించుకోలేదు. ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో పోలీసు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన జరిగినప్పుడే భద్రతా లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించలేదు.

బాసర గుడిలో జరిగిన దోపిడి చోరీ ఘటనపై ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆరా తీశారు. బాసర ఆలయానికి వచ్చి ఘటనా స్థలాన్ని సీసీ కెమెరా పుటేజీని పరిశీలించారు.

ఆలయంలో జరిగిన దోపిడి ఘటనపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా మంది గ్రామస్తులు ఆలయ కార్యాలయానికి చేరుకొని అక్కడే బైటాయించి నిరసన తెలిపారు. ఆలయ అధికారుల పరిపాలన లోపాలు, నిర్లక్ష్యం ఫలితంగానే ఈ ఘటన జరిగినట్లు వారు ఆరోపించారు. బాధ్యులను వెంటనే పట్టుకోవాలని ఆలయ ఈవో విజయ రామరావు, బాసర ఎస్సై గణేష్, తహసీల్దార్ పవన్ చంద్రకు వినతి పత్రాలు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

ఎంఐఎం కార్యాలయంలో పతాకావిష్కరణ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 15 : నిర్మల్‌లోని ఎంఐఎం కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం పతాకావిష్కరణ చేశారు. అధ్యక్షుడు అజీమ్ బీన్ యాహియా, కౌన్సిలర్లు ముజాహిద్, అబ్రార్, కోఆప్షన్ మెంబర్ సయ్యద్ మజహర్, నాయకులు రఫీక్ అహ్మద్, తయ్యబ్ బీన్ సలహా, చాంద్ పాషా, అబ్దుల్ గఫార్, ఇంతియాజ్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ భవనంలో వేడుకలు.

నిర్మల్‌లోని ఎస్టీయూ భవనంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు భూమన్న యాదవ్, వెంకటేశ్వర్ రావు, లక్ష్మీ నారాయణ, శివలింగయ్య, వర్మ, తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్‌లో జాతీయ పతాకావిష్కరణ..

నిర్మల్‌లోని భాగ్యనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొని పతాకావిష్కరణ చేశారు. కాలనీ వాసులు, సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద వేడుకలు...

ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత ఐక్య చేతన కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ పతాకావిష్కరణ గావించి, స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. ముడుసు సత్యనారాయణ, అనుముల భాస్కర్, గంగారాం, కళ్యాణ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో పతాకావిష్కరణ...

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద జాతీయ పతాకావిష్కరణ గావించారు. స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకున్నారు. పట్టణాధ్యక్షుడు సరికొండ రమేష్, భీంరెడ్డి, మౌలానా, పి. భూమేష్, వెంకన్న, గఫార్ పాల్గొన్నారు.

అమరవేణి నర్సాగౌడ్‌ను సన్మానించిన రాజయ్య

నిర్మల్ రూరల్, ఆగస్టు 15 : పాపన్నగౌడ్ జయంతి నిర్వహణ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా నూతనంగా నియమితులైన అమరవేణి నర్సాగౌడ్‌ను స్థానిక ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు.

శ్రీకాంత్‌చారి ఆశయ సాధనకు అంకితమవుదాం

భైంసా, ఆగస్టు 15 : ప్రత్యేకరాష్ట్ర సాధన కోసం గాను ప్రాణత్యాగానికి ఒడి గట్టిన తెలంగాణ అమరవీరుడు శ్రీకాంత్‌చారి ఆశయ సాధనకు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అందరం అంకితభావంతో ముందుకు సాగుదామని తెలంగాణ ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. గురువారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీకాంత్ చారి చౌరస్తాలో జరిగిన అమరవీరుడు శ్రీకాంత్‌చారి జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పిం చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిము షాల పాటు మౌనం పాటించారు. శ్రీకాంత్ చారి త్యాగ నిరతిని కొనియాడుతూ ప్రదర్శనలు నిర్వహించారు.

'సంఘ అభివృద్ధికి కృషి'

నిర్మల్ రూరల్, ఆగస్టు 15 : మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అధ్యక్షుడు తోట రమేష్ అన్నారు. గురువారం బెస్తవార్‌పేట్ సంఘ భవనంలో మున్నూరుకాపు సంఘ ఎన్నికలు నిర్వహించారు. సంఘం యొక్క కార్యవర్గం ఎన్నికతో పాటు అధ్యక్షుడిగా తోట రమేష్, ఉపాధ్యక్షుడిగా ఆకుల అశోక్, ప్రధాన కార్యదర్శిగా గుమ్ముల అశోక్ ఎన్నికయ్యారు.

కన్నుల పండువగా స్వాతంత్ర్య వేడుకలు

భైంసా, ఆగస్టు 15: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, సంస్థల్లో, విద్యాలయాల్లో, రాజకీయ పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ స్థానిక ఏరియా ఆసుపత్రిలో జాతీయ పతకాన్ని ఎగురవేసారు. ఇక మున్సిపల్ కార్యాలయంలో వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్ తో పాటు ప్రధాన పార్టీల కార్యాలయాల్లో ఆయా పార్టీల ఇన్‌చార్జీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు, ప్రతినిధులు జెండాలను ఎగురవేశారు. ఇక మిగతా స్థానాల్లో ఆయా కార్యాలయాలకు చెందిన అధికారులు, ప్రధాన వ్యక్తులు, బాధ్యులు ఎగురవేసారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు వేడుకలకు వన్నెతెచ్చాయి. ప్రధాన రోడ్లపై వినూత్న రీతిలో చేపట్టిన ప్రదర్శనలు వేడుకల ఘట్టంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.జాతీయ నాయకులు, స్వాతంత్ర సమరయోధుల వేషాధారాణతో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలల్లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. ఆటల పోటీలలోని విజేతలకు బహుమతుల పంపిణీ జరిగింది

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముథోల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శివ కుమార్, మండల విద్యావనరుల కార్యాలయంలో విద్యాధికారి మైసాజి, పోలీస్ స్టేషన్‌లో సీఐ మల్లేష్, ఏరువాక వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్త విజయ్ కుమార్, ఏడీఏ కార్యాలయంలో ఏవో భాస్కర్, ఐకేపీ కార్యాలయంలో ఏపీవో గురుచరణ్, ముథోల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవో ప్రసాద్ గౌడ్, ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో సరోజన, ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సూర్యదాస్ మూడు రంగుల జెండాను ఎగురవేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ అనిల్ కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నారాయణ, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ వెంకటేష్ గౌడ్ ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు త్రివర్ణ పతకాన్ని ఎగురవేశారు. రబింద్ర, అక్షర, శ్రీవిద్య, భాష్యం, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వాడ వాడలో త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

'మిషన్ భగీరథ' వాటర్ మెన్ మృతి

- న్యాయం చేయాలని గ్రామస్థుల ఆందోళన
- రాత్రి వరకు కొలిక్కి రాని చర్చలు

ముథోల్, ఆగస్టు 15: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్‌లో విధి నిర్వహణలో ఉండగా అదే గ్రామానికి చెందిన ప్రభాకర్ (36) గురువారం గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థుల కథనం ప్రకారం... గత ఏడు నెలల నుంచి ప్రభాకర్‌కు వేతనం సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ ఫిల్టర్ బెడ్ మెయింటెనెన్స్ కోసం ఓ ప్రైవేట్ ఏజెన్సీ గత ప్రభుత్వం అప్పజెప్పింది. అయితే ఆ ఏజెన్సీ వారు ఫిల్టర్ బెడ్‌లో పని చేసే సిబ్బందికి నెల నెల జీతాలు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వడం లేదు. మృతుడికి ఏజెన్సీ నుంచి వేతనం ఏడు నెలల నుంచి ఇవ్వలేదన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ఫిల్టర్ బెడ్‌లో మృతదేహం పెట్టి ఎదట భైఠాయించారు. మృతుడి ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకొని ఏజెన్సీ వారు ఆర్థిక సహాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ ఏఈఈ సుమన్, ఏజెన్సీ ప్రతినిధి అజయ్, మిగతా సిబ్బంది వచ్చి గ్రామస్తులతో చర్చించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సాయికిరణ్ గ్రామస్తులతో మాట్లాడారు. ఏజెన్సీ వారు మృతుడికి ఆర్థిక సహాయం చేసే విషయంలో ఒక కొలిక్కి. కొలిక్కి రాకపోవడంతో గ్రామస్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏజెన్సీ వారు ఫిల్టర్ బెడ్‌లో పని చేసే వారికి కార్మిక చట్టం ప్రకారం అమలు చేయాల్సిన నిబంధనలను పట్టించుకోలేదని వారు ఆరోపించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేసేంతవరకు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించమని గ్రామస్తులు ఖరాకండిగా చెప్పారు. దీంతో రాత్రి 7 గంటల వరకు చర్చలు కొలిక్కి రాలేదు.

విద్యతోనే గిరిజనుల ప్రగతి


మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా

ఉట్నూర్, ఆగస్టు15: ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సంక్షేమం అభివృద్ధి జరగాలంటే ప్రతీఒక్కరు చదువుకోవాల్సిన అవసరం ఉందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. గురువారం పంద్రాగస్టు వేడుకలను ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌తో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో 925 ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటుచేసి 12537 మంది గిరిజన విద్యార్థులకు 681మంది విద్యాబోధన నిర్వహిస్తున్నామన్నారు. 133 ఆశ్రమ ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేసి 33071 మంది గిరిజన విద్యార్థులకు విద్య అందిస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 34 మంది గిరిజన విద్యార్థులను కార్పొరేట్ కళాశాలలో 812 మంది గిరిజన విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశం కల్పించామన్నారు. ఆశ్రమపాఠశాలల విద్యార్థుల్లో ఇంగ్లీష్ ప్రావీణ్యం పెంచడానికి స్పోకెన్ ఇంగ్లీష్ క్లబ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్ క్లబ్బుల ద్వారా విద్యార్థులు మాట్లాడే స్థాయికి ఎదుగుతారు అన్నారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ద్వారా సీసీడీపీ పథకం ద్వారా 25కోట్లతో 1000 గృహ పనులు నిర్మాణంలో ఉన్నాయని 42పనులు పూర్తిఅయ్యాయని, మిగిలిన 573 పనులు ఉన్నాయన్నారు. సీసీడీపీ పథకం ద్వారా గిరిజన గ్రామాల్లో 155 అంగన్‌వాడీ సెంటర్ల భవనాలు మంజూరు కాగా 121 పనులు పూర్తి దశకు చేరుకున్నాయన్నారు. పీవీటీజీ గ్రామాలకు చెందిన ఐదు వేల మందికి 12 రకాల కూరగాయల విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్, పీఓ ఖుష్బుగుప్తాతో కలిసి ఐటీడీఏ అధికారులు గుర్తించిన 60మంది ఉత్తమఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను అలరించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ జాదవ్ వసంతరావు, మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, పీవీటీజీ ఏపీఓ డాక్టర్ మనోహర్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ మేస్రం మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య


జాదవ్ భరత్ మృతదేహం

బోథ్, ఆగస్టు15: మండలంలోని సాకేర గ్రామానికి చెందిన రైతు జాదవ్ భరత్ (50) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. జాదవ్ భరత్ తన నాలుగు ఎకరాల భూమితోపాటు కొంతభూమిని కౌలుకు తీసుకుని పత్తి, సోయా పంటలను సాగుచేస్తున్నాడు. గత కొన్నేళ్లుగా వ్యవసాయం కోసం చేసిన అప్పులు సుమారు రూ.4లక్షలు, ఇద్ద రు కూతుళ్ల పెళ్లికోసం చేసిన అప్పులు తీర్చలేక తీవ్రమనస్తాపా నికి గురై గురువారం తనసొంత చేనులోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఫోన్ చేయగా ఎత్తకపోవడంతో చేనుకు వెళ్లి చూడ గా పడిపోయి కన్పించాడు. వెంటనే బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందు తూ మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ బెటాలియన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆదిలాబాద్ రూరల్: మండలంలోని యాపల్‌గూడ వద్ద తెలంగాణ స్పెషల్ పోలీస్ 2వ బెటాలియన్‌ల స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమాండెంట్ నితికా పంత్ హాజరై జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల మతాలకతీతంగా యావత్ భారత దేశం స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఆనందోత్సవాలతో జరుపుకుంటున్నామని తెలిపారు. అడిషనల్ కమాండెంట్ దేవిదాస్ రాథోడ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలతో పాటు పార్టీ కార్యాలయాల్లో, సంఘ భవనాల్లో ఊరూర జాతీయ జెండాలను ఎగురవేశారు. పాఠశాల విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించి పాఠశాలలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మణ్, డిప్యూటీ తహసీల్దార్ రామారావ్, మాజీ సర్పంచి సునీత, మాజీ ఉపసర్పంచి శిరీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, బీఆర్ఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, బీజేపీ కన్వీనర్ నారాయణ, తదితరులు ఉన్నారు.


జాతీయ గీతం ఆలపిస్తున్న కమాండెంట్ నితికా పంత్, పోలీస్ అధికారులు

తలమడుగు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతోపాటు యువజన సంఘాల, కుల సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీఎం స్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి'లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలో గల 'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎడిషన్ ఇన్‌చార్జి గుడ్ల సంజీవ్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ వేడుకల్లో బ్యూరో ఇన్‌చార్జి పి.సంపత్‌రావు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి శంకరాచారి, టెక్నికల్ ఇన్‌చార్జి నరేష్ చౌదరి, సబ్ ఎడిటర్లు నర్సింహారావు, సుభాష్ చంద్ర, సీనియర్ ఫొటో గ్రాఫర్ రతన్‌కుమార్, ఆర్‌సీ ఇన్‌చార్జి ఆంజనేయులు, హెచ్‌ఆర్ రవి, స్టోర్ ఇన్‌చార్జి భూమేష్, సెక్యూరిటీ సిబ్బంది సాజిద్, కిషన్, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎడిషన్ ఇన్‌చార్జి గుడ్ల సంజీవ్ కుమార్





పారిశుధ్య కార్మికులను సన్మానించిన ఎమ్మెల్యే

బోథ్,ఆగస్టు15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువా రం బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన ఆరోగ్యం కాపాడడంలో పారిశుధ్య కార్మి కుల పాత్ర ఎంతగానో ఉందని కొనియాడారు.


కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మృతదేహాన్ని వాగు దాటించిన గ్రామస్థులు

ఉట్నూర్, ఆగస్టు 15: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా గిరిజన గ్రామాల ప్రజలకు ఇంకా రోడ్డు సౌకర్యాలు మెరుగుపడడం లేదు. ఉట్నూరు మండలంలోని రాజులగూడకు చెందిన గిరిజన వృద్ధుడు చాహకటి చిత్ర (71) గత రెండు రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురవడంతో జిల్లాకేంద్రంలోని రిమ్స్ తరలించి వైద్యం అందిస్తుండగా గురువారం మృతిచెందాడు. గ్రామస్థులు మృతదేహాన్ని తమ గ్రామానికి తరలించడానికి ప్రయత్నించగా కురుస్తున్న వర్షానికి చాందూరి, రాజులగూడ మధ్యన ఉన్న వాగు పొంది ప్రవహించడంతో గిరిజనులు ఇబ్బందులు పడ్డారు. కుటుంబసభ్యులు చాందూరి వాసులను సంప్రదించి సహాయం కోరగా రాజులగూడ గిరిజనులకు ట్రాక్టర్ ద్వారా మృతదేహాన్ని ప్రవహిస్తున్న వాగు నుంచి గ్రామానికి తరలించారు. మృతుడికి భార్య జంగుబాయి, ఐదుగురు సంతానం ఉన్నారు.


మృతదేహాన్ని ట్రాక్టర్‌లో ఎక్కించి వాగు దాటిస్తున్న దృశ్యం

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఖానాపూర్, ఆగస్టు 15 : మండలంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఊరువాడ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. పట్టణ పురవీధులలో ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులచే శోభాయాత్ర నిర్వమించారు. ఈ శోభాయాత్రలో పలువురు చిన్నారులు వేసి స్వాతంత్ర్య సమర యోధులు, జాతీయ నాయకుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివరాజ్, సర్కిల్ కార్యాలయంలో సీఐ సైదారావు, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, స్థానిక ప్రెస్ క్లబ్‌లో అధ్యక్షులు నట్ల శంకర్, పడాల లక్ష్మీనారాయణ, అటవీ శాఖ కార్యాలయంలో ఎఫ్ఆర్‌వో కిరణ్ కుమార్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలలో కార్యాలయాల అధికారులు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు, కుల సంఘాల ఆధ్వర్యంలో ఆయా కుల సంఘాల అధ్యక్షులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన నాయకుల త్యాగాలను కొనియాడారు.

భైంసా రూరల్ : భైంసా పట్టణంలోని గ్రామీణ పోలీసుస్టేషన్ సీఐ నైలు 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు పోరాడారని స్వాతంత్ర్య సమర యోదులను స్మరించుకున్నారు. అనంతరం విద్యార్థులకు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. మండల ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

తానూర్: మండల వ్యాప్తంగా గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారి శ్రీనివాస్, రైతు వేదికలో ఏఈవో సంఘవి, పీఏసీఎస్ లో చైర్మన్ నారాయణ్‌పటేల్, ప్రెస్‌క్లబ్‌లో రిపోర్టర్ రాందాస్, గ్రామపంచాయతీల్లో స్పెషల్ ఆఫీరస్ వేణుగోపాల్, శిశుమందిర్ పాఠశాలలో కమిటీ అధ్యక్షులు శివాజీ పటేల్, ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు మువ్వన్నెల జెండాను ఆవీష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం పలు పాఠశాలల్లో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కుభీర్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకొని గురువారం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా మువ్వన్నెల జెండా రెపరెలాడింది. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సోము, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మోహన్‌సింగ్, పోలీసుస్టేషన్‌లో ఎస్సై రవీందర్, ప్రభుత్వ ఆసుపత్రిలో డా. విద్యం వసుంధర, పీఏసీఎస్‌లో చైర్మన్ గంగాచరణ్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో వికార్‌అహ్మద్, వివేకానంద డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రవి, గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్, ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, రైతువేదికల్లో ఏఈవోలు, ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. చాణక్య సంస్కృతి పాఠశాల విద్యార్థులు 300ల ఫీట్ల జెండాతో ర్యాలి నిర్వహించారు. పలువురు విద్యార్థులు స్వాతంత్ర్య సమర యోదుల వేషాదరణతో వేడుకల్లో పాల్గొన్నారు.

కుంటాల : మండలంలో గురువారం 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి, డీపీవో శ్రీనివాస్ జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ నరేష్ గౌడ్, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో సోమలింగారెడ్డి, సహకార సంఘంలో చైర్మన్ నట్ల గజ్జారాం, ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కుంటాల మండల ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉద్యోగార్థులకు సంపూర్ణ సహకారం

భైంసా, ఆగస్టు 15 : వివిధ ఉద్యోగ,పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు తమ ట్రస్టు ద్వారా సంపూర్ణ సహకారం అందిస్తామని మోహన్‌రావ్ పాటిల్ ప్రజా ట్రస్టు చైర్మెన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్ వెల్లడించారు. గురువారం ట్రస్టు ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్టడీ హాల్ ద్వారా పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు వివిధ మోడల్ పరీక్షలకు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మెన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్ అభ్యర్థులకు సౌలభ్యం కోసం భైంసాలోని దారాబ్జీ జిన్నింగ్ ఫ్యాక్టరీ అవరణలో సకల వసతులు, సౌకర్యాలతో కూడిన స్టడీ హాల్‌ను ఏర్పాటు చేసామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన హెచ్‌డబ్ల్యూవో సస్పెన్షన్

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 15: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ గిరిజన శాటిలైట్ సెంటర్ పోతగూడ హెచ్‌డబ్ల్యూవో జైవంత్‌రావ్ విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు కలెక్టర్ రాజర్షి షా ఆయనను గురువారం సస్పెండ్ చేశారు. ప్రభుత్వ గిరిజన శాటిలైట్ సెంటర్‌ను బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అక్కడి సమస్యలపై ఆరా తీయగా హెచ్‌డబ్ల్యూవో జైవంత్ విధుల్లో నిర్లక్ష్యం వహించారని తేలడంతో ఆయనను సస్పెండ్ చేశారు.

ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యేకు ఆస్ట్రేలియాలో అరుదైన గౌరవం

ఖానాపూర్, ఆగస్టు 15 : ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్‌కు ఆస్ట్రేలియాలో అరుదైన గౌరవం దక్కింది. విక్టోరియా రాష్ట్ర పార్లమెంట్‌లో గురువారం ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ విక్టోరియా ఆధ్వర్యంలో నిర్వహించిన భారత 78 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన రేఖానాయక్‌కు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా విక్టోరియా రాష్ట్ర మంత్రి నటాలి హచిన్స్ రేఖా నాయక్‌ను ఘనంగా సన్మానించారు. 20 ఏళ్లుగా ప్రజాజీవితంలో ఆమె సేవలను కొనియాడుతూ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ విక్టోరియా ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు ఆమె పీఏ గుగ్గిళ్ళ సతీష్ ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలియజేశారు. విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ రాజ్‌సైనీ, విక్టోరియన్ మల్టీకల్చరల్ కమిషన్ సలహాదారు వేములరాజు, ఆస్ట్రేలియా లేబర్ పార్టీ నాయకుడు ప్రవీణ్, ఐసీఏవీ జనరల్ సెక్రటరీ తదితరులున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఆరు గ్యారెంటీల అమలుకు ప్రత్యేక కృషి
- పెన్‌గంగా ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1596 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 4వేల 447 ఎకరాల భూమి పంపిణీ
- 83లక్షల 22వేల 681మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- ప్రభుత్వ సలహాదారు మహ్మద్‌షబ్బీర్ అలీ
- ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తున్న ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్ షబ్బీర్‌అలీ

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 15: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. వెనుకబడిన జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పరేడ్ మైదానంలో కలెక్టర్ రాజార్షిషా, ఎస్పీ గౌస్‌ఆలంలతో కలిసి ఆయన జాతీయజెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాన్ని ఆలపించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పోలీసు సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు (ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వెల్ఫేర్) మహ్మద్ షబ్బీర్‌అలీ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఎంతోమంది మహానుభావుల పోరాటాల ఫలితంగా స్వాతంత్రాన్ని సాధించుకున్నామని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయులకు, రాజ్యాంగ వ్యూహకర్తలకు ఈ సందర్భంగా జోహార్లు అర్పించారు. మహనీయుల ఆశయాలు, త్యాగాల స్ఫూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిలో ముందుకు సాగుతుందని, జిల్లాను అన్నిరంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో మరింత అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందరికి చేరేలా చూడాలన్నారు. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారంటీలలో మహాలక్ష్మి, గృహజ్యోతి, యువవికాసం, చేయూత, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు అందరికీ అందేలా చూస్తామన్నారు. ఇందులో మహాలక్ష్మి పథకం తెలంగాణ ఆడబిడ్డలను మహాలక్ష్మిలను చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం మహిళలకు ఉచితబస్సు సౌకర్యం 2023 డిసెంబర్ 9న ప్రారంభించిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 83లక్షల 22వేల 681మంది మహిళలు బస్సులో ఉచితంగా ప్రయాణించినట్లు తెలిపారు. ప్రజాపాలన సేవాకేంద్రాల ద్వారా ఇప్పటివరకు 24వేల 635 దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

● 95,037 మంది వినియోగదారులకు ఉచిత విద్యుత్

జిల్లాలో గృహజ్యోతి పథకంలో భాగంగా అర్హులైన 95,037మంది వినియోగదారులకు 200యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో విద్యుత్ పునరుద్ధరణ, అభివృద్ధి పనుల కోసం రూ.25.5లక్షలు మంజూరు చేశామన్నారు. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆహార భద్రత కార్డు గ్యాస్‌కనెక్షన్ ఉండి ప్రజాపాలన కార్యక్రమంలో రూ.500 గ్యాస్ సబ్సిడీ కింద 96వేల 115 మంది లబ్ధిదారులు అర్హులుగా గుర్తించామన్నారు. ఇప్పటి వరకు ఒక లక్ష 73 వేల 256 ఎల్‌పీజీ సిలిండర్లు సరఫరా చేయబడిందని, ఇందుకు గాను రూ.4.89కోట్ల నిధులు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతురుణమాఫీ పథకం 2024 కింద ఇప్పటివరకు రెండు విడతల్లో 36వేల 387మంది రైతులకు రూ.322.29 కోట్ల నిధులు 1.50 లక్షల మంది రుణాలు గల రైతుల ఖాతాలలో జమచేసినట్లు చెప్పారు. మూడో విడత రుణమాఫీ రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రూ.5లక్షల వైద్య సహాయాన్ని రూ.10లక్షలకు పెంచినట్లు చెప్పారు. రిమ్స్ ఆసుపత్రికి రూ.11.65కోట్లతో ఎంఆర్ఐ వైద్యపరికరాల మంజూరు, పరికరాలను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

● పండుగలా వనమహోత్సవం

వనమహోత్సవాని పండుగలా చేపడుతున్నామని, ఈ ఆర్థిక సంవత్సరం 468 నర్సరీలలో మొత్తం 40.10 లక్షల మొక్కలు ఉపాధి హామీ పథకంలో పెంచి, ఇప్పటివరకు 23.81లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కింద స్వయం సహాయక సంఘాల మహిళలను రాబోయే ఐదేళ్లలో ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఈపథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఇందులోభాగంగా ఈ ఆర్థికసంవత్సరం ఇప్పటివరకు 3364 ఎంటర్‌ప్రైజెస్‌లు, 19 మీసేవా కేంద్రాలు, 108 ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాలు, 4 మహిళశక్తి క్యాంటీన్లు, 544 పాడిగేదెల పెంపకం యూనిట్లు, 2004 పెరటికోళ్ల పెంపకం యూనిట్లు, 13 మదర్ పౌల్ట్రి యూనిట్లు, 63 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఉట్నూర్‌లో ఒకసంచార చేపల విక్రయ కేంద్రం, జైనథ్‌లో ఒక మిల్క్ పాల పదార్థముల విక్రయం కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలో అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడీ, కల్లుగీత కార్మికులైన 74వేల 636 మందికి రూ.17.18కోట్ల ఆసరా పించన్లను ప్రతీనెల పంపిణీ చేస్తున్నామన్నారు.

● పెన్‌గంగా ప్రాజెక్టుకు రూ.1596 కోట్లు మంజూరు

జిల్లాలోని రైతులకు సాగునీరు అందించడానికి పెన్‌గంగా ప్రాజెక్టు నిర్మాణానికి 1596 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పటివరకు 1023 కోట్లు ఖర్చుచేసి పనులు నిర్వహించామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టు, చనకా-కోరటా ప్రాజెక్టుల భూసేకరణకు 134 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయించినట్లు తెలిపారు. వచ్చే సంవత్సరానికి 27వేల800 ఎకరాలకు నీరందించడానికి అన్నిచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా మిషన్‌భగీరథ కింద జిల్లాలోని 1234 ఆవాసాలకు, పట్టణంలోని ఇంటింటికి శుద్ధిచేసిన తాగునీరు అందిస్తామన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద 702 పాఠశాలలో 676 పాఠశాలలో మౌలిక వసతులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈవిద్యాసంవత్సరం భీంపూర్ కేజీబీవీ డైట్‌కళాశాల వసతిగృహంలో 6, 8 తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. ఒక్కొక్క కేజీబీవీకి 10లక్షల పరిమితి గల మరమ్మతుపనులు చేపట్టి 14 కేజీబీవీలలో కంప్యూటర్ ల్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం అటవీశాఖ ద్వారా 6.62లక్షల మొక్కలు 84కి.మీల పొడవున రోడ్డుకు ఇరువైపులా ఎవెన్యూ మొక్కలు నాటినట్లు చెప్పారు. యువజన, క్రీడల అభివృద్ధి శాఖ ద్వారా జిల్లాలోని 948 మంది నిరుద్యోగ యువతి, యువకులకు వృత్తి నైపుణ్య కోర్సులలో శిక్షణలు అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. క్రీడాపాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయిలో 156 పతకాలు, 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఇళ్లు లేని నిరుపేదలకు 3వేల 579 రెండు పడక గదుల నిర్మాణాలకు ప్రతిపాదించడం జరిగిందని, ఇప్పటి వరకు 674 గృహాలు సుమారు 93.5కోట్ల రూపాయల వ్యయంతో పూర్తి చేసినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద జిల్లాపరిషత్‌కు రూ.232 లక్షలు కేటాయించగా ఆ నిధులతో 122 పనులకు వార్షిక ప్రణాళిక చేసినట్లు చెప్పారు. జిల్లా పంచాయతీశాఖ ద్వారా 468 గ్రామ పంచాయతీలకు 6.60 కోట్ల నిధులు 15వ ఆర్థిక సంఘం కింద అభివృద్ధి పనుల నిమిత్తం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ చౌక్ నుంచి మావల వరకు రూ.40లక్షలతో సెంట్రల్ మీడియం ప్లాంటేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఉమ్డం- ఆదిలాబాద్ స్టేషన్ల మధ్యరైల్వేఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణం కోసం రూ.97.20 కోట్ల నిధులు, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నిర్మాణానికి రూ.55కోట్ల నిధులు మంజూరై పనులు ప్రారంభమై పురోగతిలో ఉన్నాయన్నారు. రోడ్డు వసతిలేని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందు కోసం రూ.56.2 కోట్లు మంజూరు చేశామని ఈ పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు.

● 4వేల 447 ఎకరాల భూమి పంపిణీ

భూమి కొనుగోలు పథకం కింద 1727 మంది నిరుపేద దళిత కుటుంబాలకు రూ.196కోట్ల 63లక్షల వ్యయంతో 4వేల 447 ఎకరాల భూమిని పంపిణీ చేసినట్లు చెప్పారు. మొదటిపంట పెట్టుబడి సహాయం కింద రూ.8కోట్ల 41లక్షల 3వేలు వారి ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు. అలాగే వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఈ ఆర్థిక సంవత్సరం 320 లక్షల రూపాయలు 9వేల 013 మంది విద్యార్థులకు పోస్టు, ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలు, ఫీజు రియంబర్స్‌మెంట్ అందించడంతో పాటు వసతి గృహాలలో ఉచిత వసతిని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించడానికి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా రూ.20లక్షల ఆర్థికసాయం అందించనున్నట్లు చెప్పారు. మల్టి సెక్టోరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద జిల్లాలో 4 రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజిలు, ఒక కామన్ సర్వీసెంటర్, రెండు హాస్టల్ భవనాలు మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే ఆరోగ్యలక్ష్మి పథకం కింద జిల్లాలో 10వేల 602 మంది గర్భిణీలకు, బాలింతలకు ఒక పూట సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద ఇప్పటివరకు జిల్లాలో 34వేల 67 కుటుంబాలకు 314.09 కోట్ల విలువ గల చెక్కులను అందించామన్నారు. 133 ఆశ్రమ పాఠశాలల్లో 33,071మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, స్పోకెన్ ఇంగ్లీష్ క్లబ్‌లను ఏర్పాటుచేసి విద్యార్థులను ఆంగ్లభాషలో మాట్లాడేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. అలాగే సహకార శాఖ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం జిల్లాలో 14వేల 613 ఖాతాలకు 13వేల 499 లక్షల రూపాయల ఖరీఫ్, రబీ పంటల రుణాలు అందించడం జరిగిందన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఈ సంవత్సరం గంజాయిని అరికట్టడంలో 35 కేసులలో 74 మందిని అరెస్టు చేసి, దాదాపు 111కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు పాయలశంకర్, వెడ్మబొజ్జుపటేల్, ఉన్నతాధికారులున్నారు.


సెల్యూట్ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్య అతిథులు


ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ సలహాదారులు, కలెక్టర్, ఎస్పీ


ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాన్ని ప్రదర్శిస్తున్న సిబ్బంది

సంక్షిప్త సమాచారం


నివాళులర్పిస్తున్న ఆదివాసీ సేన నాయకులు

లక్ష్మణరావుకు ఘన నివాళి

గుడిహత్నూర్ , ఆగస్టు15: మండల కేంద్రంలోని ఆదివాసీ సేన క్యాంపు కార్యాలయంలో ఆదివాసీ సేనా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కణితి లక్ష్మణ్‌రావు 3వ వర్ధంతి ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన రాష్ట్రఅధ్యక్షుడు కోవ దౌలత్‌రావు మోకాశి, రాయిసిడం జంగుపటేల్, నాయకులు సెడ్మకి భీంరావు, ఉయిక శ్యామ్‌రావు, కుంరం చత్రుఘన్, కుంరం రాందాస్, వెడ్మ చంపత్‌రావు, తొడసం భూమ పటేల్, ఆత్రం రాము, తొడసం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

బోథ్, ఆగస్టు15: మండలంలోని పార్డీ (బి) గ్రామానికి చెందిన కుడసం సౌజన్య అనే యువతి ఈనెల 9 నుండి కనిపించడం లేదని ఆమె తండ్రి బందు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈనెల 2న డీఎస్సీ పరీక్ష రాసి ఇంటికి వచ్చిన ఈమె ఈనెల 9న ఇంటినుంచి వెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తప్పిపోయిన యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజీవ్ సద్భావన యాత్రలో విషాదం

ఆదిలాబాద్‌అర్బన్, ఆగస్టు15: రాజీవ్ సద్భావన యాత్రలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం రాత్రి జిల్లా కేంద్రానికి చేరుకున్న రాజీవ్ సద్భావన యాత్రలో 80ఏళ్ల వృద్ధుడి మృతిచెందాడు. యాత్రికుల్లో ఒకడైన బెంగళూరుకు చెందిన ఎ.గోమతేశన్ (80) గుండెపోటుకు గురయ్యాడు. హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కంది శ్రీనివాస్‌రెడ్డి స్పందించి రూ.26వేలతో ప్రత్యేకఅంబులెన్స్ ఏర్పాటు చేసిమృతదేహాన్ని మృతుడి స్వస్థలానికి తరలించేం దుకు సహకరించారు.

స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

బోథ్, ఆగస్టు15: బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజుయాదవ్ ఆధ్వర్యంలో స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను గురువారం కలిశారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఈయనను కలిసి ఉన్న నాయకులు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈసందర్భంగా ఆయన నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు అబూద్, సురేందర్‌లు ఉన్నారు.

ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

జిల్లాలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజలు, నాయకులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉట్నూర్ ఐటీడీఏ ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా జెండా ఆవిష్కరించగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొజ్జుపటేల్, ఆయా పార్టీ కార్యాలయాల్లో నాయకులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.


ఐటీడీఏలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


నార్నూర్‌లో జెండాను ఎగుర వేస్తున్న నాయకులు


గోండుల కోటలో జాతీయజెండాను ఆవిష్కరించిన ఆదివాసీ సంఘాల నాయకులు


బీఆర్ఎస్ కార్యాలయంలో జెండా సెల్యూట్ చేస్తున్న జోగురామన్న, నాయకులు


జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్, పీఓ ఖుష్బుగుప్తా


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..


నార్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో..


నేరడిగొండలో జెండా వందనం చేస్తున్న తహసీల్దార్ ఎంఎ కలీం

రిమ్స్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్, ఆగస్టు15: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌ను గురువారం కలెక్టర్ రాజర్షిషా ఆకస్మికంగా తనిఖీచేశారు. దాదాపు 2 గంటలకుపై సమయం వెచ్చించి బ్లడ్ బ్యాంక్, పిల్లల వార్డు, ఫిమేల్ మెడికల్ వార్డ్, ఆర్ఓ ప్లాంట్, ఐసోలేషన్ వార్డ్, పిడియాట్రిక్ ఐసీయూ, జనరల్ వార్డ్, బ్లడ్ టెస్ట్ గది, ప్రతీవార్డులో జిల్లా కలెకర్ సందర్శించి డెంగ్యూ కేసులపై ఆరా తీశారు. ప్రతీ వార్డులో ఉన్న పేషంట్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆస్పత్రిలో డెంగ్యూ కిట్లు, ఆర్‌డీఎస్ తగినంత ఉన్నాయా, రోజుకు ఎన్ని టెస్ట్‌లు నిర్వహిస్తున్నారా అని ఫార్మసి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ ఆస్పత్రిలో ఐసీయూ వార్డ్, ఫార్మసీ, హాజరు రిజిస్టర్, ఫార్మసీలో మందుల నిల్వ ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వార్డులను సందర్శించి రోగులను పరామర్శించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ రిజిష్టర్ క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు రాబట్టారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అబిగ్యాన్ మాలవియ, రిమ్స్ డైరెక్టర్ జైవంత్ రాథోడ్, వైద్యాధికారులు, స్టాఫ్ నర్స్ పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా


రిమ్స్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

వైద్యసేవలను బహిష్కరించిన జూడాలు

ఆదిలాబాద్‌రూరల్: కోల్‌కతా వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆదిలాబాద్ రిమ్స్‌లోని జుడాలు గురువారం వార్డుల్లో సాధారణ విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కోల్కతాఘటనలో న్యాయం జరగడంతో పాటు వైద్యులకు రక్షణ కల్పించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని ఆదిలాబాద్ రిమ్స్ జూనియర్ డాక్టర్లసంఘం అధ్యక్షులు సందీప్ చారి అన్నారు. ఈసందర్భంగా రిమ్స్ అత్యవసర విభాగం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు.